# మరిడమ్మ సన్నిధిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకార్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, దేవస్థానం సిబ్బంది రమణ, వేద పండితులు నాగదేవర వెంకటశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాద్ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# జనార్ధన స్వామి ఆలయానికి కూలింగ్ వాటర్ యూనిట్ బహుకరణ



**ఆలమూరు పెన్ పవర్, ఏప్రిల్ 03;** ఆలమూరులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామి ఆలయానికి రూ. 18,500 లు విలువ గల వాటర్ కూలింగ్ యూనిట్ ని బహూకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు త్రాగునీరు అందించాలని ముఖ్య ఉద్దేశంతో ఆలమూరు గ్రామానికి చెందిన స్వర్గీయ బొబ్బా జనార్ధన్ (మునసబు) సీతమ్మ దంపతులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆలయానికి వాటర్ కూలింగ్ యూనిట్ ను బహుకరించాలని రూ 18,500 తో కొనుగోలు చేసి శుక్రవారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి బి నరేంద్ర కుమార్ లకు అందజేశారు. ఆలయానికి వాటర్ యూనిట్ ను బహుకరించిన బొబ్బా వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చిన్న, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బొబ్బా రాంబాబు, అయినవిల్లి శ్రీనివాస్,చిన్నం సుబ్బలక్ష్మి, ద్విభాష్యం సత్యలక్ష్మి, ఏలూరు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తునిలో డంపింగ్ యార్డ్, ఎస్టీపీ స్థలాల పరిశీలన






### భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం

తుని/కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 03, : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం తుని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎస్. అన్నవరం రామకృష్ణ నగర్ కాలనీ వెనుక ఉన్న కొండ పోరంబోకు స్థలాన్ని ఆయన పరిశీలించి, స్థానిక రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులతో చర్చించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మురుగునీటి శుద్ధి కర్మాగారం (ఎస్టీపీ) ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణలో భాగంగా తుని పట్టణ పరిధిలో ఉప్పరావు కాలనీ వెనుక ఉన్న స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మురుగునీటి శుద్ధి కర్మాగారం ద్వారా నివాస, వాణిజ్య, పారిశ్రామిక వనరుల నుంచి వచ్చే మురుగునీటిని శుద్ధి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట తుని తహసీల్దార్ జీ.వి.ఎస్. ప్రసాద్, తుని కమిషనర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వాడలరేవు,అల్లవరం మండలం,డాక్టర్ బి.ఆర్‌లి లిఅంబేద్కర్ కోనసీమజిల్లా.శుక్రవారం విశేషాలంకరణలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు



విశేష పుష్పాలంకారంలో అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారు.

# ఏలేరు జలాశయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్.

### ఏలేరు ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది కొరత ఉంది. త్వరలోనే సిబ్బందిని నియమిస్తాం.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** ఇటీవల జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఏలేరు జలాశయాన్ని శుక్రవారం సందర్శించారు. జిల్లాకు ఏలేరు జలాల అవశ్యకత దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఏలేరు జలాశయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జలాశయంలోని ప్రస్తుత నీటి సామర్థ్యం, ఏలేరు జలాశయం నుంచి తాగునీటి సరఫరా, పోలవరం ఎల్ఎంసి ద్వారా వచ్చే నీళ్లు, పంటకు దిగువకు విడుదల చేస్తున్న నీరు, రోజువారి మెయింటినెన్స్ వంటి వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న పవర్ హౌస్ ను పరిశీలించి, పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలేరు జలాశయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉపాధి హామీ పని ద్వారా శుభ్రం చేయించాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నేడు ఏలేరు జలాశయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఏలేరు ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది కొరత ఉందని త్వరలోనే నియామకాలు చేపట్టి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం మణిహంస పవర్ ప్లాంట్లను సందర్శించారు. రిజర్వాయర్ కెపాసిటీ, రైతులకు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగారు. రిజర్వాయర్ గేట్లు విషయమై విస్కో అధికారులతో చర్చించి సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసు ఇస్తామన్నారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏలేశ్వరం తహసీల్దార్ కె.కుసరాజు, ఎంపీడీవో సిహెచ్ రవి వర్మ, ప్రాజెక్ట్ ఈఈ కాశీ వెంకటేశ్వరరావు, డీఈలు డి. శ్యాంప్రసాద్, తమ్మయనాయుడు, వర్క్ ఇన్స్పెక్టర్ జి నాగ వెంకటేశ్వరరావు, మణిహంస పవర్ ప్లాంట్ మేనేజర్ వి ప్రసాద్ బాబు, ఏలేశ్వరం ఎస్సై ఎన్. రామలింగేశ్వరరావు, ప్రాజెక్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి ప్రదాతగా మంత్రి సుభాష్



### తణుకువాడలో ఘనంగా గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం

**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 3:** మండల పరిధిలోని తణుకువాడ గ్రామంలో శుక్రవారం నూతన గ్రామ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వనుం బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చెల్లుబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కాళా శ్రీను బాధ్యతలు స్వీకరించారు. అలాగే కమిటీకి చెందిన ఇతర సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో మంచి మనసున్న నాయకుడు, అభివృద్ధి ప్రదాతగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు.

తణుకువాడతో పాటు గొల్లపాలెం, ఆర్యవటం, తిప్పరాజుపాలెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేపట్టిన ఘనత మంత్రి సుభాష్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా తణుకువాడ గ్రామం నుంచే ప్రచారం ప్రారంభించడం ప్రత్యేకతగా నిలుస్తుందని, మంత్రి సుభాష్ కూడా తన ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వాసంశెట్టి సుభాష్‌కు తణుకువాడ గ్రామం అధిక మెజార్టీ ఓట్లు అందించిన గ్రామాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ అధ్యక్షులు చావ్వాకుల డాక్టర్ బాబు, క్లస్టర్ ఇంచార్జ్ పలివెల రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వల్లు అర్జున్ రావు, సొసైటీ అధ్యక్షులు పితాని సతీష్ కుమార్ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం కొత్త కమిటీ సమిష్టిగా కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## కార్బైట్ మామిడి పండ్లు తో జాగ్రత్త - పర్యావరణ మిత్ర గంగాధర్





**గండేపల్లి,పెన్ పవర్, ఏప్రియల్,3:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ తోటకూర గంగాధర్ కుమార్తె హేమ మణి వర్షిత పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి ఆదర్శంగా జరుపుకున్నారు. తన తండ్రి బాటలో ప్రతి పుట్టిన రోజున మొక్కను నాటడం ఆనందంగా ఉందని వర్షిత అన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ

వేసవి కాలం అనగానే అందరికీ గుర్తొచ్చే మధుర ఫలం మామిడి పండ్లు. మామిడి పండ్లు ఇష్టం లేనివారు అంటూ ఎవరూ ఉండరు. వేసవి సీజన్ ప్రారంభం అయ్యే సరికి మామిడి పండ్ల కు డిమాండ్ భారీగా పెరుగుతోంది. రుచి తో పాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఈ పండ్లకు గల డిమాండును క్యాష్ చేసుకోవడం కోసం వ్యాపారస్థులు ఈ పండ్లకు అనేకరకాల రసాయనాలు,కార్బైట్లు వేసి మాగ పెట్టిన పండ్లు మార్కెట్ లోకి రావడం ఆందోళన కలిగిస్తుంది. ప్రజలు మామిడి పండ్లు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్త వహించాలి. పండ్లు తినేముందు ఇంటివద్ద నీటిలో కొద్ది సమయం ఉంచి శుభ్రంగా కడుక్కోవడం శ్రేయస్కరం. అయితే రసం పిండుతూ తినే పండ్లను కాకుండా బంగిన పల్లి వంటి ముక్కలు గా కోసుకుని తినే పండ్లను తినడం మంచిది అని గంగాధర్ అన్నారు.

## ఆత్రేయపురం లొల్లల లాకుల పునర్నిర్మాణానికి రూ. 74.20 కోట్లు

- రైతు ల చిరకాల ఆశ నెరవేరాయి





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 3 :**ఆత్రేయపురం మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లొల్లల లాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ. 74.20 కోట్ల నిధులను మంజూరు చేయడంతో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ లాకులు పునర్నిర్మాణం చేపడితే స్థానిక వ్యవసాయం, సాగునీటి సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడనున్నాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా లొల్ల లాకులకు వద్ద ఉన్న సర్ అర్దన్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిత్రపటానికి మండల అధ్యక్షుడు కుసంపూడి రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరు వెంకటరాజు ఆధ్వర్యంలో మండల నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కృషితోనే ఈ నిధులు మంజూరయ్యాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. లాకుల పునర్నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందని, ప్రాంత అభివృద్ధికి ఇది దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, పనులు త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు. అధికారులు కూడా త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రశిక్షణ మహా అభియాన్ ఘనవిజయం





**కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం -- యు. వెంకటేశ్వరరావు**

**ఆత్రేయపురం, పెన్ పవర్ ఏప్రిల్ 03:**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026" కార్యక్రమం ఆత్రేయపురం మండలంలో ఘనంగా, విజయవంతంగా ముగిసింది. మండల బీజేపీ అధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురం గ్రామంలోని రైతు విశ్రాంతి భవనం హాల్‌లో గురువారం సాయంత్రం ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం శుక్రవారం సాయంత్రం వరకు నిరంతరంగా కొనసాగింది. శిబిరానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై ఆసక్తిగా పాల్గొన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రముఖ నాయకులు హాజరై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, సీనియర్ నాయకుడు తమనంపూడి రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చికురుమిల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు శంఖు సాదిక్, జిల్లా కార్యదర్శి రమావర్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతాలు -- కార్యాచరణపై లోతైన చర్చలు

శిబిరంలో పార్టీ చరిత్ర, సిద్ధాంత పునాదులు, సంస్థాగత నిర్మాణం, కార్యపద్ధతి, విస్తరణ వ్యూహాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన "అంత్యోదయ సిద్ధాంతం"ను గ్రామస్థాయిలో అమలు చేయాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. సమాజంలోని చివరి వ్యక్తికి సేవలు చేరేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పేదలు, రైతులు, మహిళలు, యువతకు అందుతున్న ప్రయోజనాలను ప్రజలకు చేర్చడం కార్యకర్తల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పథకాల అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంపై శిక్షణప్రస్తుతం రాజకీయాల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, దాని వినియోగంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. పార్టీ భావజాలాన్ని ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో సోషల్ మీడియాను ఆయుధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను ఖండించే విధానాలు, సానుకూల ప్రచారం నిర్వహించే మార్గాలపై కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు.

క్రమశిక్షణతో సేవ -- కార్యకర్తల బాధ్యతదేశభక్తి, సాంస్కృతిక విలువలు, జాతీయ భావజాలాన్ని పెంపొందించడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, క్రమశిక్షణతో పార్టీ పనులు నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

ఎన్నికల దిశగా సమన్వయం అవసరంరాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు ఇప్పటి నుంచే సమన్వయంతో పని చేయాలని నాయకులు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ బలం పెంచి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని తెలిపారు.

పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో కన్వీనర్ అల్లు భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శిష్ట సూర్య కుటుంబరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వానపల్లి శేషగిరిరావు, గూడవల్లి రాంబాబు, చేకూరి రమేష్ వర్మ, మండల కార్యదర్శులు యజ్జవరపు అప్పారావు, నరుకుల వీరభద్రం, సీనియర్ నాయకులు పితకా సత్యనారాయణ, బలుసు రవిశంకర్, పడాల నాగేశ్వరరావు, గండ్రోతు వీరగోవింద్, వీర్నల రమణబాబు తదితరులతో పాటు మండల కమిటీ సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్ర ప్రముఖులు, క్రియాశీల కార్యకర్తలు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శిక్షణా మహా అభియాన్ ద్వారా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం, పార్టీ సిద్ధాంతాలపై లోతైన అవగాహన పెరిగిందని, ఇది క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని మండల అధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

## నర్సీపట్నం ఘటన బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 3:** నర్సీపట్నం ఘటన బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్, జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గంపేటలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు మరింత పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులే దళితులపై దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మూడో వార్డులో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ పండుగ సంబరాల్లో డప్పు కొడుతున్న ఎస్సీ కాలనీకి చెందిన మైలపల్లి దాసును పోలీసులు సమక్షంలోనే సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ చెంప చెళ్లుమని కొట్టడం దళితులను అవమానించడమే కాకుండా వారి మనోభావాలను దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు.

ఇలాంటి ఘటనలు ఈ రాష్ట్రంలో పెరుగుతున్నాయని, అధికారంలో ఉన్నామని ఎవరూ ఏమీ చేయలేరనే ధైర్యంతో దళితులను లక్ష్యంగా చేసుకుని నాయకులు, కార్యకర్తలు హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

## అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభసందర్భంలో కొవ్వొత్తుల ర్యాలీ



**గండేపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 03,** మండల కేంద్రమైన గండేపల్లి లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఆనందోత్సవాలతో గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ ప్రజ లు కొవ్వొత్తుల వెలిగించి వారి సంతోషాన్ని వ్యక్తం చేసి ర్యాలీ చేశారు ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధానమంత్రి మోడీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి టిటిడి బోర్డు మరియు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కి కాకినాడ టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కి గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు మోహన్ రావు కి గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పార్టీ శ్రేణులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మురళీకృష్ణంరాజును కలిసిన ప్రత్తిపాడు నియోజకవర్గం పాస్టర్స్ సంఘ నాయకులు.

-ఈ నెల 5న నిర్వహించే 19 వ క్రీస్తు పునరుత్థాన మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానం



**కిర్లంపూడి/పత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 03:** ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజును ప్రత్తిపాడు మండలం ధర్మవరం ఆయన నివాసంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు పాస్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 05 వ తేదీ ఆదివారం ధర్మవరం గ్రామంలో పాస్టర్ రెవ॥ బి. జోసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే 19 వ వార్షిక క్రీస్తు పునరుత్థాన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరు కావలసిందిగా కోరారు. మురళీకృష్ణంరాజును ఆహ్వానించిన వారిలో పాస్టర్స్ జిల్లా అడ్వైజర్ రెవ॥ అబ్రహం సామ్యూల్, రీజినల్ చైర్మన్ రెవ॥ గుడాల. ప్రభకర్ జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యులు వల్లూరి రత్నం,మండల అడ్వైజర్, ఎబిసిడి,ప్రసాద్,మాజీ అధ్యక్షులు ఓకసీమ, తాటిపర్తి పాస్టర్, జి ప్రేమానంద్,సిహెచ్ జోషావా,తోపాటు పత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు పాస్టర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కోన బాబ్జి,ఎడ్ల సత్యనారాయణ , కోలా తాతబాబు గారు,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య పలువురు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపాలెం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో






**కాజులూరు, పెన్ పవర్, ఏప్రిల్ 3:** కాజులూరు మండలంలోని గొల్లపాలెం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో జె. రాంబాబు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.


ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సూర్య ప్రకాశరావు, భాగ్యవతి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అలాగే పంచాయతీ సిబ్బంది సమీర్ శర్మ, వీఆర్వోలు శ్రావణి, శ్రీనివాస్, తాతారావులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, అంగర కృష్ణ, అంగర శ్రీను, తోట కృష్ణ, కోకా హరి, సుబ్బారావు, ఆర్టోస్ చిన్న, చిన్నా డాక్టర్, పోతుల వీరబాబు తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. అలాగే ఎంపీడీవో జె. రాంబాబు మంజేరు, కుయ్యేరు, ఆర్యవటం, పెనుమళ్ళ కాజులూరు తదితర గ్రామపంచాయతీ లలో కూడా ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు ముగ్గురికి తీవ్ర గాయాలు





**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03;**216ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం ఏలూరు జిల్లాలోని చింతలపూడికి చెందిన సుంకర నవీన్, చందుమళ్లకు చెందిన కె.రామ్‌తేజ, పాలకొల్లుకు చెందిన కె.శివాజీ గణేష్‌కుమార్ కారులో విశాఖపట్నం బయలుదేరారు. స్థానిక లాకుల వద్దకు వచ్చేసరికి అపసవ్య దిశలో వెళ్లేందుకు ప్రయత్నించిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ పెట్రోలింగ్, అంబులెన్స్, 108 అంబులెన్స్‌లో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్సను అందించి రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** సర్వ మానవాళి పాపవిమోచన కోసం ఏసుక్రీస్తు త్యాగం చేసిన రోజును స్మరించుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో గల చర్చిలన్నీ విశ్వాసులతో కిటకిటలాడాయి. క్రీస్తుకు శిలువ వేసిన తర్వాత చెప్పిన ఏడు సూక్తులను గుర్తుకు చేసుకుని ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ, బైబిల్ పఠిస్తూ ఆధ్యాత్మిక చింతనలో గడిపారు. పట్టణ పరిధిలోని

కట్టమూరు పుంత కల్వరి మిరాకల్ చర్చిలో దైవసేవకులు రెవరెంట్ డాక్టర్ పురుషోత్తందాస్ లంక, రాజకుమారి గుడ్ ఫ్రైడే సందేశం ఇచ్చారు. జనావళిని ఉద్ధరించేందుకు భూమిపై అవతరించి సర్వ మానవాళి కోసం రక్తం చిందించిన మానవతామూర్తి ఏసుక్రీస్తు అని అన్నారు. మంచికి దూరంగా అత్యాశ, పాపపు పనులతో అసత్య మార్గంలో వెళ్తున్న ప్రజల పాప పరిహారార్థం వారిలో మానవత్వం, మంచితనం నింపేందుకు ఏసుక్రీస్తు సిలువ యాగం చేశారని బైబిల్ చెబుతోందన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, సహనం, అవధులు లేని త్యాగం..ఇది జీసస్ జీవితం మానవాళికి ఇచ్చిన సందేశం అని అన్నారు. మనుషుల మధ్య ద్వేషం, కక్షలకు తావు ఇవ్వకూడదని, ప్రేమ, క్షమా గుణాలతో జీవించాలన్న ఏసుప్రభు దివ్య బోధనలను మననం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జేసుదాస్ లంక, బ్రదర్ ఐ. పుష్పరాజు, బ్రదర్ ఎన్. జేమ్స్, అరుణోదయ దాస్, దయాకర్ దాస్ లంక, స్వరూప, పి. రూతుమణి, పీటర్, కృపా మణి, ఒ.లక్ష్మి, యు. దుర్గ, షాలిని, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో శుభ శుక్రవారం ఆరాధనలో క్రైస్తవ విశ్వాసులు




**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 3 :**ప్రపంచవ్యాప్తంగా గుడ్ ఫ్రైడే ను క్రైస్తవ సహోదరులు పశ్చాత్తాప హృదయంతో జరుపుకున్నారు. మానవాళి పాప విమోచన కోసం రక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణం ద్వారా పరిష్కరించారని నమ్మే క్రైస్తవులు ప్రపంచంలో మూడు వంతులుగా ఉన్న క్రైస్తవులు శుభ శుక్రవారంగా భావించి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. 2000 ఏళ్ల క్రితం ఎరుషలేము నగరంలో జరిగిన సిలువ యాగాన్ని ఏసుక్రీస్తు పడిన శ్రమలను, చిందించిన రక్తాన్ని స్మరణ చేసుకొని హృదయంతో కీర్తనలు పాడుతూ అనేకమంది క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. శుభ శుక్రవారం ప్రత్యేకతను కేథలిక్ లు, ప్రొటెస్టెంట్లు, పెంతెకోస్తులు, బాప్టిస్టులు శుభ శుక్రవారాన్ని చాలా పవిత్రంగా ఆచరిస్తారు. ఉపవాసం ఉండి పాపక్షమాపణ కోసం పశ్చాత్తాపంతో ప్రార్థనలు చేస్తారు. ఇందులో భాగంగా సంఘ కాపరులు, నాయకులు ప్రత్యేక సందేశాలు ఇస్తారు. సిలువ మార్గం యొక్క ప్రాముఖ్యతను మానవాళికి జరిగిన పాప విమోచనను నేటి ఉపదేశాలలో పాస్టర్లు ప్రబోధిస్తారు. ఇది ప్రపంచమంతటా జరిగే పవిత్ర కార్యమని విశ్వాసులు భావించి ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేస్తారు. కుటుంబ సమేతంగా పాల్గొని యేసు క్రీస్తు సిలువ మరణాన్ని ధ్యానం చేసుకుంటూ తరిస్తారు. ఇలా ఉండగా మండపేట నియోజకవర్గంలో శుభ శుక్రవారం సందర్భంగా చర్చలన్నీ ప్రార్థనలతో నిండిపోయాయి. విశ్వాసులు ఉపవాస దీక్షలతో నేడు పాల్గొని పశ్చాత్తాప హృదయంతో ప్రార్థనలు చేసుకుని క్షమాపణలు వేడుకున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని అన్ని గ్రామాలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనల సందడి కనిపించింది. ఏడిద హోలీ టిరిటీ లూథరన్ చర్చిలో శుభ శుక్రవారం సందర్భంగా సంఘ కాపరి ఆర్ విజయ్ కుమార్ సందేశమిస్తూ సర్వ మానవ పాప విమోచన కోసం సిలువపై ఏసుక్రీస్తు ప్రాణ త్యాగం చేశారని, ప్రేమ క్షమ త్యాగం అనే మూడు సుగుణాలను ప్రపంచానికి అందించారని, విశ్వాసులంతా ఏసు మార్గంలో నడుచుకుని సమాజంలో శాంతి సౌహార్థాలు నెలకొల్పాలని ఉపదేశించారు. ఉపవాస దీక్షలో ఉన్న విశ్వాసులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువపై వేలాడుతున్న ఘట్టాన్ని హృదయ విదారకంగా మననం చేసుకుంటూ, పాప పరిహారానికి పశ్చాత్తాప హృదయంతో క్షమాపణ పొందాలని పాస్టర్ విజయ్ కుమార్ విశ్వాసులను కోరారు. మండపేట లోని కేథలిక్ లు, ప్రొటెస్టెంట్లు, పెంతకోస్తులు, బాప్టిస్టులు శుభ శుక్రవారాన్ని విధిగా ఆచరించి ఆశీర్వాదం పొందారు. ఇలా ఉండగా ఆదివారం రానున్న ఈస్టర్ వేడుకకు చనిపోయిన తమ పూర్వీకుల స్మృత్యర్థం ప్రత్యేకంగా అలంకరించడానికి విశ్వాసులు సన్నద్ధమవుతున్నారు. కొవ్వొత్తులు పూలమాలలు సమాధులపై అలంకరణ కోసం ప్రత్యేక రంగులు కొనుగోలు చేస్తున్నారు.

## జగన్‌ను కలిసిన చంద్రబోస్



**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 03:**వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి కోనాల చంద్రబోస్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబోస్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చంద్ర బోస్ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో అధినేతను కలిసే అవకాశం లభించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో చేరిన అనంతరం తొలిసారిగా జగన్‌ను కలవడం తనకు ఆనందంగా ఉందన్నారు.

## అమరావతి విజయంలో రైతుల త్యాగం కీలకం



- **షరీఫ్‌ను రాజ్యసభకు పంపాలి**
- **టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్**

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 3 :** రాష్ట్ర రాజధాని అమరావతి అంశంలో పార్లమెంట్ ఉభయ సభల సమ్మతి లభించడం చారిత్రాత్మక ఘట్టమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ విజయానికి రైతుల త్యాగాలు, దీక్షలు, నిరంతర పోరాటమే ప్రధాన కారణమన్నారు. అమరావతి కోసం అవమానాలు, దాడులు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయని రైతులను ఆయన అభినందించారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మూడు రాజధానుల ప్రతిపాదనను విధాన మండలిలో అడ్డుకుని అమరావతికి చట్టబద్ధత సాధించడంలో మాజీ చైర్మన్ ఎం.ఏ. షరీఫ్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అమరావతి పరిరక్షణలో నిబద్ధతతో వ్యవహరించిన ఎం.ఏ. షరీఫ్ సేవలను గుర్తించి, ఆయనను రాజ్యసభకు పంపాలని సల్మాన్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఆయనలాంటి నాయకులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడం ద్వారా దేశానికి ఆదర్శంగా నిలుస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కల నెరవేర్చిన బండారు రూ.74.20 కోట్లతో లొల్ల లాకులు ఆధునీకరణ-బొక్కా ప్రసాద్



**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రిల్3;**కోనసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన లొల్ల లాకులు ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.74.20 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల టీడీపీ యువనాయకుడు బొక్కా ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృషి ఫలితంగా ఈ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించడం రైతులకు శుభవార్తగా పేర్కొన్నారు.

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ముక్కామల--రావులపాలెం మార్గంగా అవిడి చేరుకున్నప్పుడు 2900 కిలోమీటర్ల మైలురాయి వద్ద లొల్ల లాకుల ఆధునీకరణతో పాటు కీలక అభివృద్ధి హామీలు ప్రతిపాదించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆత్రేయపురం మండలంలోని లొల్ల లాకుల ఆధునీకరణ, రావులపాలెంలో జ్యోతిరావు పూలే పేరుతో బీసీ కళ్యాణ మండపం, కొత్తపేటలో అంబేద్కర్ పేరుతో ఎస్సీ కళ్యాణ మండపం, ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అప్‌గ్రేడ్ వంటి అంశాలు అప్పుడే ముందుచూపుతో ప్రతిపాదించారని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు కారణంగా యువగళం పాదయాత్ర మధ్యలో ఆగిపోవడంతో ఆ ప్రాంతంలో మైలురాయి ఏర్పాటు జరగకపోయినా, అసెంబ్లీలో మాత్రం లొల్ల లాకుల ఆధునీకరణ కోసం ఎమ్మెల్యే బండారు గళం నిరంతరం వినిపించిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లకు బొక్కా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ అమలుతో కోనసీమ రైతులకు భారీగా ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ు

## యు టి ఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్.

**ఏలేశ్వరం, పెన్ పవర్ , ఏప్రిల్ 3:** స్థానిక యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో తమ కార్యాలయంలో ఏప్రిల్6 తేదీ నుండి ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ ఇవ్వనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి జట్ల సోమరాజు శుక్రవారం ప్రకటించారు. స్థానిక ఎండిఓ కార్యాలయం వెనక నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ కార్యాలయంలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన తో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ డైలీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. ఈనెల ఆరవ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోమరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8019521021,6301233897,9491575119, నంబర్లను సంప్రదించవలసిందిగా ఆ ప్రకటన సోమరాజు తెలిపారు.

## కిర్లంపూడి మండలంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు.

- **భక్తిశ్రద్ధలతో పలు ప్రార్ధనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు.**
- **కిర్లంపూడి ఇమ్మానియేల్ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సువార్త ప్రకటన.**



**కిర్లంపూడి,పెన్ పవర్, ఏప్రియల్ 03**:కిర్లంపూడి మండలంలో పలు గ్రామాల్లో ఉన్న ప్రార్ధన మందిరాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.గుడ్ ఫ్రైడే వేడుకలను పురస్కరించుకుని పలు గ్రామాల్లో ఉన్న ప్రార్ధన మందిరాల్లో క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ ప్రార్ధనలకు క్రైస్తవ సోదర, సోదరీమణులు ఉపవాస దీక్షలతో హాజరై ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రార్ధన మందిరాల్లో సంఘ కాపరులు గుడ్ ఫ్రైడే సందర్భంగా అందించిన క్రైస్తవ సందేశం క్రైస్తవ సోదరులను ఎంతగానో ఆకట్టుకుంది.మండల కేంద్రమైన కిర్లంపూడిలో ఉన్న ఇమ్మానుయేల్ ప్రార్ధన సంఘ కాపరి మూరా పీటర్ ఆధ్వర్యంలో గుడ్డు ఫ్రైడే వేడుకల సందర్భంగా కిర్లంపూడి,చిల్లంగి, జగపతినగరం గ్రామాల్లో సువార్త ప్రకటన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు సిలువ సువార్త భజన గీతములు,సిలువలో పలికిన ఏడు మాటలు ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూత్ సంఘ మాజీ ఎంపీపీ మూరా సహదేవుడు,సంఘ పెద్దలు మురా చంటిబాబు,యూత్ సభ్యులు నందికళ్ల ఆనంద్ కుమార్,ఎం శ్రీను,బులిపే అశోక్,రాజాల రాజు,రాజల జయప్రకాశ్,మురా నీరజ,గుద్దాటి స్నేహా,జ్యోతి, సౌజన్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 03:**ప్రత్తిపాడు మండలం పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ప్రత్తిపాడులో ఉన్న రోమన్ క్యాథలిక్ దేవాలయం విచారణకర్త రె వ, ఫాదర్,ఎన్ మోహన్ ప్రసాద్,సంఘస్తులు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘస్తులు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు పురవీధుల గుండా సిలువ మార్గ ప్రత్యేకతను వివరిస్తూ వివిధ ప్రదర్శనలు నిర్వహించడమే కాకుండా, భారీ ర్యాలీగా కొండ గుడికి తరలి వెళ్లారు.ఆలయంలో జపమాలతో కూడిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వివిధ గ్రామాల ప్రజలు, ఉపదేశికులు, మఠ కన్యలు, మరియదళ సభ్యులు,సంఘస్తులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## కొత్తపేట మండలం పంచాయతీ స్పెషల్ అధికారుల జాబితా విడుదల




**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రిల్3;**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలానికి చెందిన పంచాయతీ స్పెషల్ అధికారుల జాబితాను సంబంధిత శాఖ విడుదల చేసింది. మండల పరిధిలోని గ్రామాల్లో పరిపాలన సక్రమంగా సాగేందుకు అధికారులను నియమించినట్లు తెలిపారు.

వాడపాలెం గ్రామానికి పి.ఎస్. నరేష్ కుమార్ (ఎంపీడీవో), కొత్తపేటకు వై. రాంబాబు (తహసీల్దార్), మందపల్లికి కె. ద్వారకా దేవి (మండల వ్యవసాయ అధికారి), బిల్లకుర్రుకు డా. జి. కోటేశ్వరరావు (ఉద్యాన శాఖ అధికారి)లను నియమించారు.అవిడి, గంటి గ్రామాలకు జి.ఎస్. నారాయణరావు (ఉప ఎంపీడీవో --ఎస్.జి.ఎస్.డబ్ల్యూ), ఖండ్రిగ, పలివెల గ్రామాలకు శ్రీ ఐ. సుభాకర బాబు (ఉప ఎంపీడీవో --పి.ఆర్.) బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మోడెకుర్రులో ఎ. గజలక్ష్మి (సీడీపీవో, ఐసీడీఎస్), వానపల్లిలో ఎం. హరికృష్ణ రెడ్డి (పరిపాలనా అధికారి, ఎంఫీపీ) విధులు నిర్వహిస్తున్నారు.మండల ప్రజలు తమ అవసరాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## ఆర్ సి ఎం చర్చ్ ఆధ్వర్యంలో ఘనంగా గుడ్ ఫ్రైడే.




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** మండలంలో క్రైస్తవ మందిరాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ సి ఎం చర్చ్ పాస్టర్ ఎం రాయప్ప ఆధ్వర్యంలో నిర్వహించబడిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో భాగంగా ఆర్సీఎం చర్చి నుండి బాలాజీ చౌక్ మీదుగా ఏలేశ్వరం పురవీధుల గుండా దైవ ఉపాసుకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభనికి ముందు

చర్చ్ పాస్టర్ రాయప్ప మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే (పరిశుద్ధ శుక్రవారం) ఏసుక్రీస్తు మానవాళి పాప విముక్తి కోసం శిలువుపై బలిదానం చేసిన త్యాగానికి చిహ్నంగా క్రైస్తవులు అత్యంత పవిత్రంగా జరుపుకునే రోజు గుడ్ ఫ్రైడే అన్నారు. ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చు శుక్రవారం యేసు క్రీస్తు అనుభవించిన బాధలు, మరణం, త్యాగాన్ని ధ్యానిస్తూ ప్రార్థనలు ఉపవాసాలు తో గడిపిన గంభీరమైన సంతాప దినం గుడ్ ఫ్రైడే అని అన్నారు.

ప్రపంచంలో సర్వ మానవాళి శాంతి సహనం సామరస్యంతో మెలగాలన్న ఏసుక్రీస్తు బోధన లను విశ్వాసులంతా ఆచరించాలని పిలుపునిచ్చారు. ఏసుక్రీస్తు తనని తాను మానవాళి పాపాలకు ప్రాయశ్చిత్తంగా సిలువపై బలిగా అర్పించిన రోజునే గుడ్ ఫ్రైడే గా జరుపు కుంటున్నాం అన్నారు.అనంతరం స్థానిక ఆర్ సి ఎం చర్చి నుండి మెయిన్ రోడ్, బాలాజీ చౌక్ మీదుగా మేరీ మాత కొండ వరకు సిలువ తో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువైన రోజున జరిగిన చరిత్రలో ముఖ్య ఘట్టాలను వివిధ వేషధారణలతో దృశ్య రూపకాలను క్రైస్తవ విశ్వాసకులు ర్యాలీలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు జనులు పురవీధుల్లో బారులు తీరారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి పుష్పోత్సవం





**ఆలయంపుష్పాలంకరణలతో కళకళలాడుతూ భక్తులను ఆహ్లాదపరిచింది**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 3 :**కోనసీమ జిల్లాలోని వాడపల్లి తిరుమల క్షేత్రంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం నిర్వహించిన శ్రీ పుష్పోత్సవం అపూర్వ వైభవాన్ని సంతరించుకుంది. సాయంత్రం వేళ ఆలయంపుష్పాలంకరణలతో కళకళలాడుతూ భక్తులను ఆహ్లాదపరిచింది.

ఈ పుష్పోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ చార్యులు ఉదయం నుంచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో స్వామివారిని అలంకరించి, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పుష్పాలతో స్వామివారి విగ్రహం అలంకరించబడిన తీరు భక్తులను భక్తి పరవశంలో ముంచెత్తింది.

కార్యక్రమం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి దర్శనం పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ, తాగునీరు వంటి సదుపాయాలు సమృద్ధిగా కల్పించారు.అలాగే ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని అత్యంత ఘనంగానిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ పుష్పోత్సవం సందర్భంగా ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, భక్తుల "గోవిందా గోవిందా" నినాదాలతో ప్రాంతం మార్మోగింది. వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి.


## ఆలమూరులో ప్రత్యేక అధికారులు వీరే

**18 పంచాయతీలు ఏడుగురు అధికారులు**

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03;**గ్రామపంచాయతీ సర్పంచ్ ల పదవి కాలం గురువారంతో ముగుసినందున శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు.ఆలమూరు మండలంలో 18 గ్రామపంచాయతీలుగాను ఏడుగురు అధికారులను నియమిస్తూ డాక్టర్ బిఅర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంత లక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎంపీడీవో ఏ. రాజు కు ఆలమూరు, చెముడులంక, చొప్పెల్ల, మడికి గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా నియమించారు. అలాగే తాసిల్దార్ కేజీ ప్రకాష్ బాబును జొన్నాడ, పెదపల్ల, సూర్యారావు పేట లకు నియమించారు. ఎంఈవో బి.అప్పాజీ చింతలూరు, కలవచర్ల గ్రామాలకు నియమించగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి. మీనా ను బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, నర్సిపూడి పంచాయతీలకు నియమించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎస్. వీర్రాజు ను పినపళ్ల, సంధిపూడి లకు నియమించగా మండల పరిస్థితి ఏవో ఎం మెహెర్ ప్రకాష్ ను నవాబుపేట, పెనికేరు లకు అలాగే వ్యవసాయ శాఖ ఏడి సిహెచ్కివి చౌదరి ని మోదుకూరు, గుమ్మలేరు గ్రామ పంచాయతీ లకు నియమించారు.

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళం




**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 3 :**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం పొందుతూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవిస్తున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకపోకలతో కిటకిటలాడుతున్నాయి.

శుక్రవారం స్వామివారి దర్శనానికి విచ్చేసిన విశాఖపట్నం కు చెందిన మండ రశ్మి స్నిగ్ధ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రూ.50,116లను విరాళంగా సమర్పించడం విశేషంగా నిలిచింది. ఆమె భక్తిశ్రద్ధలకు ఆలయ అధికారులు అభినందనలు తెలిపారు.


ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతకు స్వామివారి ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి బి వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంతో సత్కారంతో ఘనంగా సత్కరించారు.భక్తుల విరాళాలతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

స్వామివారి కృపతో ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## శ్రీ జగన్మోహిని కేశవ స్వామి పుష్పోత్సవం (పుష్పయాగం)

**అత్యధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**







**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 3:**డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీ జగన్మోహిని కేశవ ఉ గోపాల స్వామి దేవస్థానంలో శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగానిర్వహించబడుతున్నాయి.ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం, తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన, మంత్రపుష్పములు, వేదపారాయణ వంటి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడనున్నాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ద్వాదశ ప్రదక్షిణములు నిర్వహించి అనంతరం శ్రీ పుష్పోత్సవం (పుష్పయాగం) భక్తుల సమక్షంలో వైభవంగా జరుపబడుతుంది. ఇక కార్యక్రమంలో భాగంగా నాట్య శిరోమణి, గిన్నీస్ వరల్డ్ రికార్డు గ్రహీత, జాతీయ స్థాయి కూచిపూడి నృత్య కళాకారిణి రావి బేబీ సత్యవాణి (కొత్తపేట) ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.ఈ మహోత్సవాలను ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు కార్యనిర్వహణాధికారి బి వెంకటరమణమూర్తి సమన్వయంతో నిర్వహిస్తున్నారు.

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవలో నిమగ్నమై ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని ఆలయ అధికారులు ఆహ్వానిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

